
సాక్షి
మంచిర్యాల

గురువారం । 21 । డిసెంబర్ । 2023



'కడెం' క్రాప్ హాలీడే
కడెం ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గిపోయాయి. 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఆయకట్టులో క్రాప్ హాలీడే ప్రకటించే పరిస్థితి ఏర్పడింది. రైతులు నిరాశ చెందుతున్నారు. 8లో



గతమెంతో ఘనం !
లక్సెట్టిపేట ప్రభుత్వ పాఠశాలకు ఘనమైన చరిత్ర ఉంది. పూర్వ విద్యార్థులు ఉన్నతాధికారులు, నేతలుగా ఎదిగారు. భవనం శిథిలావస్థతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో

గరిష్టం/కనిష్టం
27.0 /12.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

28న జెడ్పీ సమావేశం

మంచిర్యాలటౌన్: ఈ నెల 28న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. కోరం లేక వాయిదా పడిందని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

కేసులు సత్వరమే పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ

రామకృష్ణాపూర్: అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీ సాయంతో ఎటువంటి క్లిష్టతరమైన కేసులనైనా త్వరగా పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీసీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టపరిధిలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలని సూచించారు. 100 డయల్ ఫిర్యాదులపై తక్షణమే స్పందన ఉండాలని, బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. రోడ్డు భద్రత, సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ పంతాటి సదయ్య బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. పోలీసు రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల తొర్రూర్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటారు. అండర్–17 విభాగంలో 63 నుంచి 66 కిలోల కేటగిరీలో ఏ.ప్రేమ్‌కుమార్ బంగారు పతకం, 70–75 కిలోల కేటగిరీలో యు.ఇంద్రవర్మ కాంస్య పతకం సాధించారు. అండర్–19 విభాగం 46 కిలోల కేటగిరీలో పి.పరమేశ్ కాంస్య పతకం, 56 నుంచి 60 కిలోల కేటగిరీలో జే.సంపత్ కాంస్య పతకం అందుకున్నారు. ఏ.ప్రేమ్‌కుమార్ త్వరలో మహారాష్ట్రలోని అకోలలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ శేరు శ్రీధర్ తెలిపారు. పీఈటీ దేవేందర్, విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ అభినందించారు.

కోవిడ్ ముప్పుపై సన్నద్ధం



ఐదు నెలల తర్వాత తెరుచుకున్న మంచిర్యాలలోని ఆర్టీపీసీఆర్ ల్యాబొరేటరీ

- ఆసుపత్రులు, బెడ్‌ల వివరాల సిద్ధం
- టెస్టింగ్ కోసం ఏర్పాట్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



ఆర్టీపీసీఆర్ ల్యాబోరేటరీలోని దుమ్ము తొలగిస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: రెండేళ్లపాటు ప్రజల జీవన విధానాన్ని అతలాకుతలం చేసి ఎన్నో జాగ్రత్తలు నేర్పిన కరోనా మహమ్మారి ముప్పు మరోసారి భయపెడుతోంది. ప్రస్తుతం వస్తున్న కరోనా ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 సబ్ వేరియంట్ వ్యాప్తి దేశంలో పెరుగుతుండడం, అక్కడక్కడ మరణాలు సంభవిస్తుండడంతో కేంద్రం అప్రమత్తమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కోవిడ్ ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే జిల్లాలో కోవిడ్ కేసులు నమోదైతే ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సేవలపై పూర్తి స్థాయి నివేదికను రూపొందించారు. కోవిడ్ మొదటి, రెండో విడత వ్యాప్తి సమయాల్లో ఏయే ఆస్పత్రులు కోవిడ్ టెస్టులు చేయడం, వ్యాక్సిన్లు ఇవ్వడంతోపాటు చికిత్స అందించాయో వాటి వివరాలు సేకరించారు. మరోసారి కరోనా ముప్పు పొంచి ఉందనే కేంద్ర ప్రభుత్వ సూచనలతో కోవిడ్ బారిన పడిన వారికి అత్యవసరంగా వైద్యం అందించేందుకు ఎన్ని పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయి, కోవిడ్ పరీక్షలకు అవసరమైన కిట్ల వివరాలు పూర్తిగా సేకరించారు. ఆస్పత్రులు, పడకలు, ఆక్సిజన్, పీపీఈ కిట్లు, ఎన్95 మాస్కులు, వైద్యులు, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ల వివరాలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖకు జిల్లా శాఖ కార్యాలయం నుంచి పంపించారు. కోవిడ్ కేసులు పెరిగితే వాటి పెరుగుదలను బట్టి అవసరమైన పడకలు, ఆక్సిజన్ సిలిండర్ల ఏర్పాటు, అవసరమైన మందులు పూర్తి స్థాయిలో అందించేందుకు చేపట్టాల్సిన అంశాలను పొందుపర్చారు. అనుమానితులకు కోవిడ్ పరీక్షలు చేసేలా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిట్లను అందుబాటులో ఉంచనున్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన వారికి అవసరమైన మందులు తెప్పించి సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ పరీక్షలను అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభించనున్నారు. కోవిడ్ పరీక్షలు చేసేందుకు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌ను ఆరు నెలల తర్వాత బుధవారం తెరిచారు. అన్ని యంత్రాల పనితీరు పరిశీలించి గదుల్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళి తొలగింపజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరోనా ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండడం వల్ల ముప్పును కొంతవరకు ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. కరోనా జాగ్రత్తలపై ఇప్పటికే ప్రజల్లో పూర్తి అవగాహన ఉందని, మాస్కులు ధరించడం వల్ల కోవిడ్ సోకేందుకు అవకాశం తగ్గడంతోపాటు పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతాయి. ప్రస్తుతం జిల్లాలో తీవ్రంగా చలి ఉండడం, పెళ్లిళ్లు, శుభకార్యాలు పెద్ద సంఖ్యలో జరుగుతుండడం, క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు, పండుగలు, శుభకార్యాలకు గుంపులుగా హాజరయ్యే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, వైరస్ పూర్తిగా అంతరించిపోదని, ఏదో ఒక రూపంలో ప్రభావం చూపిస్తూనే ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. గుంపులుగా ఉన్న ప్రజల మధ్య మాస్క్ ధరించి వెళ్లాలని, వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు జాగ్రత్తలే అసలైన మందుగా వైద్యులు పరిగణిస్తున్నారు. గతంలో కోవిడ్ వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతోపాటు కొందరు మృత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకోగా, ప్రస్తుతం ప్రజల్లో కోవిడ్‌పై ఉన్న అవగాహనతో మరోసారి కోవిడ్ బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

జిల్లాలో కోవిడ్ చికిత్స అందించే ఆస్పత్రుల వివరాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీ	1
ప్రభుత్వ ఆసుపత్రి	1
ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి	1
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	2
ఇతర ఆసుపత్రులు	3
పీహెచ్‌సీ/హెచ్‌డబ్ల్యూసీ/ యూపీహెచ్‌సీ	144
ప్రైవేటు ఆస్పత్రులు	17
మొత్తం	169

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం



కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికైతే కోవిడ్ భయం ఏమి లేకపోయినా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ టెస్టులు చేయడంతోపాటు కోవిడ్ వచ్చిన వారికి అవసరమైన బెడ్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధం చేశాం. గతంలో మాదిరిగానే కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించి వైద్యులకు సహకరించాలి. కోవిడ్ వచ్చిన తరువాత జాగ్రత్త పడకుండా, ముందస్తుగానే జాగ్రత్తగా ఉంటే కొంత ఇబ్బంది తగ్గుతుంది.
– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో అందుబాటులో ఉన్న బెడ్‌లు, వెంటిలేటర్లు, వైద్యులు

జిల్లాలోని ఐసోలేషన్ బెడ్‌లు	372
ఆక్సిజన్ బెడ్‌లు	502
ఐసీయూ	246
ఐసీయూలోని వెంటిలేటర్లు	77
పీఎస్ఏ ప్లాంట్లు	2
వెంటిలేటర్లు	84
నెబ్యులైజర్లు	108
ఆక్సీమీటర్లు	304
ఆక్సిజన్ సిలిండర్లు	249
పీపీఈ కిట్లు	7,438
ఎన్-95 మాస్కులు	20,715
వైద్యులు	258
నర్సులు	448
అంబులెన్స్‌లు	30

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు



పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, కొత్త వేరియంట్ జేఎన్1 వ్యాప్తి చెందుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కు ధరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. మాస్కు ధరించడంపై బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కోవిడ్ కోసం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్టీపీసీఆర్ కిట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, పరీక్షల సంఖ్య పెంచాలని తెలిపారు. రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించి, అత్యవసరమైతేనే బయట తిరగాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లు, చికిత్సకు అవసరమైన మందులు, ఆక్సిజన్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 152 ప్రభుత్వ, 17 ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,461 పడకలు, ఐసీయూ బెడ్‌లు 246, ఐసీయూ వెంటిలేటర్ ఉన్న బెడ్‌లు 77, ఆక్సిజన్ సపోర్ట్ బెడ్‌లు 502, ఐసోలేషన్ బెడ్‌లు 372 ఉన్నట్లు తెలిపారు. అందుకు సరిపడా వైద్యులు, వైద్య సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. అయ్యప్ప భక్తులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డెమో బుక్కా వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

పత్తి రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులు తాము పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించే క్రమంలో నిబంధనల మేరకు 8 శాతం నుంచి 12 శాతం తేమ మించకుండా చూడాలని తెలిపారు. నాణ్యమైన పత్తికి మద్దతు పొందాలని తెలిపారు.

కంప్యూటర్లు వచ్చాయ్



నెన్నెల పాఠశాలలో కంప్యూటర్లను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్

- పాఠశాలలు, ఎమ్మార్సీలకు మంజూరు
- డిజిటల్ బోధన, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

మంచిర్యాలఅర్బన్: సాంకేతిక విద్య, ఆన్‌లైన్ వ్యవహారాలకు ప్రభుత్వ పాఠశాలలు, మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లకు కొత్త కంప్యూటర్లు వచ్చాయి. క్షేత్రస్థాయి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరయ్యాయి. కంప్యూటర్లు, ప్రింటర్లు, 2కేవీఏ యూపీఎస్, ఎంఎస్‌ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్‌బోర్డులు, కేబుల్‌వైర్లు, జాక్‌ప్యానెల్ తదితర సామగ్రి చేరాయి. ప్రస్తుతం విద్యుత్ పనులు సాగుతున్నా యి. త్వరలోనే ఇన్‌స్టాల్ చేసి వినియోగంలోకి తేనున్నారు. జిల్లాలోని 14ఎమ్మార్సీలకు కంప్యూటర్లు మంజూరు కావడంతో క్షేత్రస్థాయి సర్వేలు ఆన్‌లైన్ నమోదు సులువు కానుంది. ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా.. రెండు మూడు కంప్యూటర్లతోనే వివరాలు నమోదు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం మండలాలకు ఒక్కోఎమ్మార్సీకి ఆరు చొప్పున కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లు మంజూరయ్యాయి. జిల్లాలో ఇంతవరకు కంప్యూటర్లు లేని 47 ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయి. 2006లో ప్రభుత్వం కొన్ని ఎంపిక చేసిన పాఠశాలలకు కంప్యూటర్లు అందించింది. కొంతకాలం బోధన సాగినా తర్వాత బోధకులను నియమించకపోవడం, మరమ్మతులు వచ్చినా పట్టించుకోకపోవడంతో అక్కడక్కడ మినహాయిస్తే అన్ని చోట్ల మూలకు చేరాయి. ఈ నేపథ్యంలో తాజాగా 47 పాఠశాలలకు 320 కంప్యూటర్లు మంజూరు చేయగా ఆయా పాఠశాలలకు చేరాయి. వీటి ద్వారా విద్యార్థులకు డిజిటల్ బోధన, హెచ్‌ఎంలు వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు వినియోగించాల్సి ఉంటుంది.

మండలాల వారీగా..

బెల్లంపల్లి మండలంలో రెండు పాఠశాలలకు 13 కంప్యూటర్లు, భీమినిలో రెండు పాఠశాలలకు 13, భీమారంలో ఒక పాఠశాలకు 8, చెన్నూర్‌లో 6 పాఠశాలలకు 35, దండేపల్లిలో 7పాఠశాలలకు 48, హాజీపూర్, జైపూర్‌లో ఒక్కో బడికి 5, జన్నారంలో 5 పాఠశాలలకు 33, కన్నెపల్లిలో రెండు పాఠశాలలకు 10, కాసిపేటలో ఒక పాఠశాలకు 5, లక్సెట్టిపేటలో నాలుగు పాఠశాలలకు 25, కోటపల్లిలో 5 పాఠశాలలకు 36, మంచిర్యాలలో 2 పాఠశాలలకు 20, మందమర్రిలో 2 పాఠశాలలకు 13, నస్పూర్‌లో ఒక పాఠశాలకు 5, నెన్నెలలో 2 పాఠశాలలకు 18, తాండూర్‌లో 1 పాఠశాలకు 10, వేమనపల్లిలో 2 పాఠశాలలకు 18 కంప్యూటర్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు.

విద్యార్థులకు డిజిటల్ బోధన

జిల్లాలో 47 పాఠశాలలకు 320 కంప్యూటర్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశాం. సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులకు డిజిటల్ బోధన సాగనుంది. ఎమ్మార్సీల్లో వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు ఎవరికి వారు వినియోగించుకోవచ్చు. త్వరలోనే పూర్తిస్థాయిలో కంప్యూటర్లు అందుబాటులోకి రానున్నాయి. – శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీవో శేషాద్రి
- 'ఉపాధి' పనులపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

బెల్లంపల్లిరూరల్: ఉపాధి హామీ పథకం అమలులో, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఆర్‌డీవో బి.శేషాద్రి అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, కన్నెపల్లి, భీమిని, కాసిపేట, మందమర్రి మండలాల ఈజీఎస్ ఏపీవోలు, ఈసీ, సిబ్బందికి ఉపాధి హామీ పనులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో 50 మందికి విధిగా ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. కూలీలకు కచ్చితమైన కొలతలతో కూడిన పనిని నిర్దేశించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల ఏర్పాటు, వాటి సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ సదస్సులో అదనపు డీఆర్‌డీవో దత్తారావ్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీడీవోలు రాజేందర్, జనహర్, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: షెడ్యూల్ ప్రకారం సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య అన్నారు. బుధవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న జరిగే ఎన్నికలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం అన్యాయమని, ఎన్నికలకు అన్ని సంఘాలు, యాజమాన్యం ఈ నెల 4న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎదుట సంతకాలు చేశాయని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా వేయాలని 10 సంఘాలు కోర్టు, యాజమాన్యానికి రాసివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. టీబీజీకేఎస్ ఓడిపోతుందని ఇంతకుముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలను అడ్డుకుంటే, ఇప్పుడు అదే దారిలో ఐఎన్టీయూసీ ఓడిపోతుందనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాయిదా కోరుతోందని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహణకు అడ్డంకులేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే.బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూర్ కొమురయ్య, నాయకులు చంద్రమోహన్, సంపత్, వేణుమాధవ్, అఫ్రోజ్‌ఖాన్, ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఏరియా స్టోర్స్‌లో..

ఏరియా స్టోర్స్‌లో ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో ఏఐటీయూసీ గెలిస్తే అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామని పేర్కొన్నారు. ప్రతీ కార్మికునికి 250 గజాల ఇంటి స్థలంతోపాటు రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామని తెలిపారు. కొత్త గనులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

బస్సు కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

చెన్నూర్: చెన్నూర్ నుంచి కోటపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆందోళన చేపట్టారు. ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాల్లో బస్సు నడిపించాలని నినాదాలు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రద్దీగా వెళ్తున్నాయని పేర్కొన్నారు. సమయపాలన పాటించకపోవడంతో పాఠ్యాంశాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు వెంటనే ప్రత్యేక బస్సు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ స్కైలాబ్
- విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



భీమారంలో విద్యార్థులకు క్రీడాసామగ్రి అందిస్తున్న జీఎం స్కైలాబ్

భీమారం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ స్కైలాబ్ కోరారు. అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అటవీ అభివృద్ధి సంస్థ ప్రతీ సంవత్సరం ఆర్జించిన లాభాల్లో రెండు శాతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వివిధ సామగ్రి, సదుపాయాల కల్పనకు సామాజిక సేవా కింద కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుతూ అడవుల రక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీవాణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ జీ.సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న అసోసియేషన్ సభ్యులు

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి మారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్, డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, కంకణాల సతీష్‌రెడ్డి, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'


పాదయాత్ర చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తా నుంచి నస్పూర్‌లోని కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు గజెల్లి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేష్, నాయకులు కీర్తి బిక్షపతి, శ్రీపతి రాములు, వెంకటేశ్, రాజన్న, బోరే శేఖర్, చంద్రమౌళి, బైర మల్లేశ్, అంజన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లవాగులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభించిందని ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో జారిపడి ఉంటాడని భావిస్తున్నారు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య


మల్లీశ్వరి మృతదేహం

కాసిపేట(బెల్లంపల్లి): బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం లక్సెట్టిపేట మండలం మోదెల గ్రామానికి చెందిన కుసనపల్లి మల్లీశ్వరి(50) కుమారుడు సాయికృష్ణ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతోంది. మంగళవారం సాయంత్రం దేవాపూర్‌లో నివాసం ఉంటున్న పెద్ద కూతురు శాతరాశి శైలజ ఇంటికి భర్త చంద్రయ్యతో కలిసి వెళ్లింది. రాత్రి భోజనం చేసి పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున బావిలో దూకింది. కుటుంబ సభ్యులు తాడు సాయంతో బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడెం క్రాప్ హాలీడే

- ప్రస్తుతం ప్రాజెక్టులో నీటినిల్వలు 4.02 టీఎంసీలు
- 1.2 టీఎంసీలతో చెరువులు, కుంటలు నింపే యోచనలో అధికారులు
- యాసంగిలో పంటలకు నీరందించని పరిస్థితి
- నిరాశలో ఆయకట్టు రైతులు


కడెం ప్రాజెక్టు

జన్నారం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా చివరి ఆయకట్టుకు నీరందలేదు. వారబంధీ విధానంతో నీరందించారు. అయినా కొందరు రైతుల పొలాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో ప్రస్తుతం ప్రధాన కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రబీ సీజన్‌లో క్రాప్ హాలీడే ప్రకటించే యోచనలో అధికారులు ఉన్నారు. వేసవిలో నీటికి ఇబ్బంది రాకుండా చెరువులు, కుంటలు నింపేందుకు మాత్రమే నీటిని వదిలే అవకాశం ఉంది.

68,150 ఎకరాల్లో సాగు..

కడెం ప్రాజెక్టు ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68,150 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురియడంతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. నైజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టు కావడంతో గేట్లు మొరాయించడం, పలు కారణాల వల్ల వర్షాకాలంలో వచ్చిన నీరంతా వృథాగా పోయింది. మిగిలిన నీటితో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందించడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గింది. ప్రాజెక్టు పరిధిలోని 1 నుంచి 8 డిస్ట్రిబ్యూటరీలు కడెం, దస్తురాబాద్ మండలాలు, 9 నుంచి 22 డిస్ట్రిబ్యూటరీలు జన్నారం మండలం, 23 నుంచి 28 డిస్ట్రిబ్యూటరీలు దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలంలో నీటిని అందిస్తాయి. జన్నారం మండలంలో కడెం జలాశయంలోని డీ 9 నుంచి 22 వరకు సుమారుగా 13 వేల ఎకరాలు, డీ 22 నుంచి 28 వరకు దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరకు సుమారుగా 40 వేల ఎకరాల వరకు నీరందిస్తుంది.

చెరువులు నింపడంతోనే సరి..

కడెం జలాశయంలో నీరు లేకపోవడంతో యాసంగి సీజన్‌లో పంటలకు నీరందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో మూడు టీఎంసీల నీరు స్టోరేజీ ఉండగా కేవలం 1.02 టీఎంసీల నీటితో రబీ పంటకు నీరందించే పరిస్థితి లేదని తేల్చిచెప్పేశారు. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా రబీ సీజన్‌లో పంటలకు నీరిందించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రస్తుతం 4 టీఎంసీల నీటితో పంటలకు సరిపడా నీరందించే పరిస్థితి లేదు. దీంతో ఉన్న 1.02 టీఎంసీల నీటితో కడెం ఆయకట్టు కింద గల చెరువులు, కుంటలను నింపి వేసవిలో నీటికి ఇబ్బంది కలుగకుండా చూసేందుకు అధికారులు యోచిస్తున్నారు. కాగా వానాకాలంలో మంచి పంటలు పండించిన రైతులు ప్రస్తుత యాసంగిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. ప్రాజెక్టు నీటిని వదులుతారనే ఆశతో ఉన్న రైతులకు క్రాప్ హాలీడే నిరాశ నింపే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం

కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు మాత్రమే నిల్వఉంది. ఈ నీటితో రబీ పంటలకు నీటిని వదలడం సాధ్యం కాదు. ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. రబీ సాగుకోసం కాకుండా ఆయకట్టు కింద చెరువులు, కుంటలు నింపేందుకు నీటిని విడుదల చేసేందుకు చర్చిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుంది.

– బోజేదాస్, డీఈ, కడెం ప్రాజెక్ట్

బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, బాక్సింగ్ కోచ్ రాజేశ్ తెలిపారు. అండర్–14 విభాగంలో మంచిర్యాలకు చెందిన బి.రుత్విక్(32–34 కేజీలు), బి.అనురాగ్(46–48 కేజీలు), కాగజ్‌నగర్‌కు చెందిన కే.సాయిప్రణయ్(34–36 కేజీలు), అండర్–17 విభాగంలో మంచిర్యాలకు చెందిన ఏ.ప్రేమ్‌కుమార్(63–66కేజీలు) గోల్డ్‌మెడల్ సాధించారని తెలిపారు. వీరు ఈ నెల 24 నుంచి 29వరకు మహారాష్ట్రలోని ఆకోలాలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో..


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన శ్రీవర్షిని

చెన్నూర్‌రూరల్: ఈ నెల 22 నుంచి 27 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు చెన్నూర్ మండలం ఆస్నాద్ జెడ్పీ హెచ్‌ఎస్ ఏడో తరగతి విద్యార్థిని శ్రీవర్షిని ఎంపికై నట్లు పీఈటీ గాజుల శ్రీనివాస్ తెలిపారు. నారాయణ్‌పేట్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు చాంపియన్ షిప్ సాధించగా శ్రీవర్షిని ఉమ్మడి జిల్లా తరపున పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సర్పంచ్ నాగభూషణం, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు నాయిని శ్రీజ, మంచర్ల అంజలితో హెచ్‌ఎం, పీఈటీ

రాష్ట్ర స్థాయి పోటీలకు ..


నెన్నెల: మండలంలోని మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు నాయిని శ్రీజ, మంచర్ల అంజలి అండర్–17 కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను పాఠశాల కమిటీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.


సహస్రను అభినందిస్తున్న హెచ్‌ఎం జోబిన్

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు..

మంచిర్యాలఅర్బన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 క్రికెట్ పోటీల్లో స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 23నుంచి 27వరకు కొత్తగూడేంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననుంది. సహస్రను ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీ రాజేందర్ అభినంధించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి


సల్మాన్‌ఖాన్(ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సల్మాన్ ఖాన్ (22) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం భీమిని మండలంలోని కమలాపూర్ ప్రాజెక్టు వద్ద వాచ్‌మెన్‌గా ఉన్న బలరాంఆది సర్కార్‌కు నిత్యావసర సరుకులు ఇవ్వడానికి వెళ్లాడు. ప్రాజెక్టులో చేపలు పడతానని నాటుపడవలో వెళ్లడంతో ప్రమాదవశాత్తు పడవ అడ్డం తిరిగింది. దీంతో ప్రాజెక్టులో పడి మృతి చెందాడు. ఎంతసేపటికీ ఒడ్డుకు చేరుకోకపోవడంతో బలరాం ఆది సర్కార్ మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బుధవారం ఉదయం మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు గజ ఈతగాళ్లతో ప్రాజెక్టులో వెతికించగా మృతదేహం లభించింది. మృతుని సోదరుడు గౌస్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పత్తి ఏరేందుకు వెళ్తూ మృత్యు ఒడిలోకి..

- ప్రమాదవశాత్తు ఆటోలోంచి కిందపడి యువతి మృతి



అఖిల(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): పత్తి ఏరేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు యువతి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాల్వాయినగర్‌కు చెందిన దుర్గం అఖిల(18) బుధవారం గంగాపూర్ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరడానికి ట్రాలీ ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడింది. అపస్మారస్థితిలోకి వెళ్లడంతో వెంటనే కౌటాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని, వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

డ్రైవర్ అజాగ్రత్త.. విద్యార్థికి గాయాలు

నేరడిగొండ: కుప్టి జాతీయ రహదారిపై ఉదయం టాటా మ్యాక్స్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బుధవారం ఇచ్చోడ వైపు నుంచి టాటా మ్యాక్స్ వాహనంలో ముఖ్ర గ్రామానికి చెందిన విద్యార్థులను తీసుకొస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఇందులోని ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఇచ్చోడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాలక్రైం: 'గాంధారి ఖిల్లాకాడ మాసక్కని సిన్మా ముచ్చట్లు' పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సినీ గేయ రచయిత అక్కల చంద్రమౌళి మాట్లాడుతూ గాంధారి ఖిల్ల కాడ మాసక్కని సిన్మా ముచ్చట్లు అనే ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో తెలుగు సినిమాకు చెందిన ప్రముఖ దర్శకులు, రచయితలు, ఉమ్మడి జిల్లాకు చెందిన సినీ కళాకారులు పాల్గొంటారన్నారు. ప్రాంతీయ జీవితాలను కథలుగా, సినిమాలుగా రూపొందించే అంశాలపై చర్చిస్తామన్నారు.

గంజాయి స్వాధీనం


నిందితుడిని చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఏరియా లో బుధవారం గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బెల్లంపల్లి బస్తీకి చెందిన షేక్ జమీర్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 350 గ్రాముల గంజాయి లభించింది. గత నెలలో కూడా అతని వద్ద పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జమీర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం


అవిశ్వాసపత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

నెన్నెల(బెల్లంపల్లి): నెన్నెల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బీఆర్‌ఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు బుధవారం జిల్లా సహకార సంఘం అధికారి శ్రీనివాస్‌రెడ్డికి అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేశారు. మండలంలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గానూ 8 మంది కాంగ్రెస్, ఐదుగురు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు ఉన్నారు. కాంగ్రెస్‌కు 8 మంది డైరెక్టర్లు ఉండటంతో అవిశ్వాసం నెగ్గనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ల విషయంలో మంతనాలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పదవులు కట్టబెట్టాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ అధినాయకత్వానికి సూచిస్తున్నారు. అవిశ్వాసపత్రాన్ని అందజేసిన వారిలో ఇందూరి రాజ్‌కుమార్, గట్టు మల్లేశ్, పోచిరెడ్డి, చీర్ల రామక్క, మెండి నర్సయ్య, లింగయ్య, రాజమొగిళి, శారద ఉన్నారు.

నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి


సమావేశంలో పాల్గొన్న జీఎం, అధికారులు

శ్రీరాంపూర్: నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్ (ఆపరేషన్స్), వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్పత్తి అవుతున్న బొగ్గు, అవుతున్న రవాణా వివరాలను జీఎం వారికి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గును ఉత్పత్తి చేయాలని, అదే సమయంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తిని లక్ష్యాన్ని కూడా అధిగమించాలన్నారు. నాణ్యమైన బొగ్గును సరఫరా చేసినప్పుడే వినియోగదారుల మన్నలను చూరగొంటామన్నారు. ఈ సమావేశంలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం శ్రీనివాస్, వీ పురుషోత్తం రెడ్డి, డీజీఎం చిరంజీవిలు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలతో సింగరేణిలో మార్పురావాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు సంఘం ఎన్నికలతో సింగరేణిలో మార్పు తీసుకురావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు గెలిచిన ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్‌ల వల్ల కార్మికులకు నష్టమే జరిగిందన్నారు. వారి హయాంలో భూగర్భ గనులు మూతపడి ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లాయన్నారు. ఈ వ్యవస్థ మారాలన్నా సింగరేణిలో పూర్తి మార్పులు జరగాలన్నా రాబోయే ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలన్నారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు సదానందం, శ్రీనివాస్, శ్రీపతి బానేష్, సంఘం రాజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయిస్తాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): గుర్తింపు సంఘం ఎన్నికల్లో తాము గెలిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వసూలు చేయిస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం ఆర్కే 7 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రూ.29 వేల కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ డబ్బులు చెల్లించకపోవడంతో కంపెనీ ఆర్థిక ఇబ్బందుల్లో పడిందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. బీఎంఎస్ గెలిస్తే కార్మికులకు ఎన్నికల సమయంలో తాము ఇస్తున్న హామీలన్నీ అమలు చేస్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాగిడి శ్రీకాంత్, మోతే ఓదెలు, గొల్ల మహేందర్, మద్దెల శ్రీనివాస్, బోయిన మల్లేశ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రాత్మక హక్కులు సాధించాం


మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘంగా తాము చరిత్రాత్మక హక్కులు సాధించామని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత తమదేనన్నారు. కార్మికుల క్వార్టర్లకు ఏసీ పెట్టుకున్న సౌకర్యం కల్పించామని, విద్యుత్ బిల్లులు మాఫీ చేయించామని, లాభాల వాటా 32 శాతం పెంపుదల, కోలిండియాలో లేకున్నా మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాల్లో అవకాశం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, ఇంకా అనేక హక్కులు సాధించామన్నారు. సమావేశంలో నాయకులు పెట్టం లక్ష్మణ్, మహిపాల్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంబడి తిరుపతి, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలోకి టీబీజీకేఎస్ ముఖ్యనేతలు


ఐఎన్‌టీయూసీలో చేరుతున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): నిన్న మొన్నటి వరకు ఊగిసలాటలో ఉన్న టీబీజీకేఎస్ ముఖ్యనేతలు ఎట్టకేలకూ యూనియన్‌కు గుడ్‌బై చెప్పి ఐఎన్‌టీయూసీ తీర్థం పుచ్చుకున్నారు. టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డివిజన్ చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, బ్రాంచి సెక్రటరీ గడ్డం మహిపాల్‌రెడ్డి, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బుధవారం రాత్రి రసూల్‌పల్లిలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ సమక్షంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. కష్టపడి పనిచేసే వారికి యూనియన్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, గరిగే స్వామి, కేంద్ర కార్యదర్శులు సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు పాల్గొన్నారు.

'ఎల్‌ఐసీలో వేతన సవరణ చేపట్టాలి'


నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

పాతమంచిర్యాల: జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీలో ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే చేపట్టాలని సంస్థ అధికారులు, ఉద్యోగులు బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 నెలల క్రితం వేతన సవరణ చేపట్టాల్సి ఉండగా యాజమాన్యం నిర్లక్ష్యం వలన అమలు కావడం లేదన్నారు. ఏటా సంస్థ లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ వేతన సవరణ చేపట్టక పోవడం సంస్థ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు సంజీవయ్య, మల్లేశ్, ఉద్యోగుల సంఘం నాయకుడు ఆర్.రాజేశం, వికాసాధికారుల (డెవలప్‌మెంట్ అధికారులు) సంఘం నాయకులు సతీష్, ప్రభాకర్, నరేష్, మాలతీదేవి, సుష్మ, శైలజ, పద్మావతి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, సౌమ్య, జగదీశ్వర్, హిమశ్రీ, మౌనిక, సోనీ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్: వరకట్న వేధింపుల కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేష్ బుధవారం తీర్పునిచ్చారు. లైజనింగ్ ఆఫీసర్ కె సాగర్, ఎస్సై సీఎంఎస్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం 2019లో సిర్పూర్(టి) పోలీస్ స్టేషన్ పరిధిలోని డోర్‌పెల్లి గ్రామ పంచాయతీ రామ్‌నగర్‌కు చెందిన సూర ఎల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆడె మహేశ్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై మధుకర్, డీఎస్పీ సుధీంద్ర, స్వామి విచారణ చేపట్టారు. సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంతో న్యాయమూర్తి నిందితుడికి పైశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.